# ప్రజాకళ

ప్రజాస్వామిక సాహిత్య పత్రిక

## అంతర్జాతీయ మహిళా దినం: మార్చి 8



దేశాలమధ్య శత్రువ్యూహాల్ని
శవాలు లెక్కతేలుస్తాయి
దేశాల మధ్య వ్యాపార సంబంధాలు అంకెల్తోసహా దొరుకుతాయి
అక్కాతమ్ముళ్ళమధ్య
ఇప్పుడు రక్త సంబంధం ఒక వలస రాగ సంబంధం, ఒక వెట్టి

మార్చి 2007 సంచిక: రెండవ భాగం

మీ రచనలు, అభిప్రాయాలు పంపించండి, నిర్మాణాత్మక చర్చలో పాల్గొనండి
Editor@Prajakala.org

సూచిక

## వ్యాసం:

స్త్రీ జీవిత చిత్రణలో భావజాల ప్రభావం - డా. దార్ల వెంకటేశ్వరరావు........................................................ 3

## ఇంటర్వ్యూ:

పి. సత్యవతి గారితో ఇంటర్వ్యూ : మొదటి భాగం ........................................................................ 5
పి. సత్యవతి గారితో ఇంటర్వ్యూ : రెండవ భాగం........................................................................ 11

## సాహిత్య వార్తలు:

మాక్సిమ్ గోర్కీ 'అమ్మ' నవల: సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాదు - డా. దార్ల వెంకటేశ్వరరావు............. 16
రైతు కథ కు ఆహ్వానం.................................................................................................... 18

## కథ:

బైండ్లామె భూమడుగదా మరి! - గోగు శ్యామల ........................................................................ 19

## స్త్రీ జీవిత చిత్రణలో భావజాల ప్రభావం - డా. దార్ల వెంకటేశ్వరరావు

మన ప్రాచీన తెలుగు సాహిత్యం స్త్రీని ఒక భోగ వస్తువుగా చిత్రించటంలో భావజాలం పాత్ర చాలా ఉంది. రామాయణం, మహా భారతం, భాగవతం, ప్రబంధాలు, శతకాలు మొదలైన వాటిన్నింటిలోనూ ఈ భావజాల ప్రభావం ఉంది. సర్వ సాధారణంగా భావజాలం దేశ,కాలానుగుణంగా రూపొందుతుంది. మన భారత దేశంలో వేదాలు, స్మృతులు, పురాణాల రూపంలో హిందూభావజాలం ఉంది.

ఇది తరువాత కాలంలో "హిందూ ధర్మ సూత్రాలు" గా ప్రచారం పొందింది. ఈ భావజాలం ప్రధానంగా వర్ణ, లింగభేధాలతో రూపొందింది. కొన్ని వర్ణాలవారిని కర్మపేరుతో ఇంచుమించు బానిసలుగానే మార్చుకున్నారు. రామాయణకాలంలో కర్మ సిద్ధాంతాన్ని వ్యతిరేకించినందుకు శంబూకుడు మొదలైన వార్ని మరణశిక్షవిధించటానికీ వెనుకాడకపోవటానికీ ఈ భావజాల ప్రభావమే ప్రధాన కారణం. ఈ భావజాల ప్రభావమే 'ఆదర్శం' పేరుతో సీతాదేవిని అగ్నిప్రవేశం చేసేలా పురిగొల్పింది. అన్ని చేసినా శ్రీరాముడ్నే సీతాదేవి 'తన దైవం'గా భావించటంలోనూ భావజాల ప్రభావం ఉంది. పరిశోధన దృష్టితో చూస్తే హిందూ భావజాలాన్ని ఆధారంగా చేసుకొని స్త్రీని పురుషుడు తనబానిసగా ఎలా మార్చుకున్నాడో స్పష్టమవుతుంది.

హిందూభావజాలంలో జెండర్ సమస్య సామాన్యమైనదికాదు. స్త్రీని శూద్రురాలుగా పరిగణించారు. ఒకప్పుడు మహోన్నతమైన సింధూనాగరికతా కాలం నాటికి మాతృస్వామ్య వ్యవస్థ ఉండగా, ఆర్యులు భారత దేశంలో ప్రవేశించిన తరువాత, నెమ్మదినెమ్మదిగా పితృస్వామిక వ్యవస్థకు పయనించేటట్లు చేయగలిగారని పరిశోధనలు తెలుపుతున్నాయి. కారల్ మార్క్స్, ఏంగిల్స్ , డి.డి.కోశాంబి, రోమిల్లాథాపర్, ఆర్. ఎస్. శర్మ తదితరుల పరిశోధనలు ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. ఆనాటి సమాజంలో అధిక సంఖ్యలో స్త్రీదేవతలు పూజింపబడినా, క్రమేపీ పురుష దేవుళ్ళు పూజలందుకోవటం ప్రారంభించిన తరువాత స్త్రీ దేవతల స్థానం అధమస్థాయికి పోవటం లోనూ ఈ భావజాలం పాత్ర ఎంతో ఉంది.

మన తెలుగులో నీతిశతకాలు పేరుతో కొన్ని శతకాలను పిలుస్తున్నారు . అంతే కాకుండా" నీతి శతకములు సర్వజన హితకరములైనవి... విషయ బాహుళ్యమును బట్టి నీతి శతకములు సర్వజనపఠనీయములగుచున్నవి" ( డా. జి. నాగయ్య 'తెలుగు సాహిత్య సమీక్ష , రెండవ సంపుటి. 1996: 568) అనే అభిప్రాయంలో ఈ శతకాలు ప్రచారం లో ఉన్నాయి. శతకాల్లో నీతి లేక పోలేదు. కానీ, ఆ నీతి అందరికీ సంబంధించిందికాదు. అది ప్రధానంగా పురుష దృక్పథం నుండి రూపొందింది.
నీతి శతకాల్లో ఒక విశేషమేమిటంటే , వాటిలో కొన్ని సార్వ జన,సార్వకాలిక నీతులుంటాయి .

వాటిని చూపుతూ తమభావజాలాన్ని చాలా జాగ్రత్తగా అందరిలో ఇంజెక్ట్ చేస్తుంటాయి . 16, 17 శతాబ్దాల్లోనే అనేక అభ్యుదయభావాలను వివిధ పద్యాలుగా వెదజల్లిన వేమన పద్యాల్లోనూ స్త్రీ పట్ల చాలా నిరసన భావాలు కనిపిస్తాయి. అయితే , అందులో వేమన చెప్పిన అసలు పద్యాలెన్ని అనేది నేటికీ పరిశోధనాంశాల్లో నలుగుతునే ఉంది. ఆ పరిశోధన ఫలితాలు తెలిసే వరకూ మాత్రం స్త్రీ పట్ల వ్యక్తమైన వేమన భావాలు స్త్రీని అవమానించే విధంగానే ఉన్నాయని భావించక తప్పదు. “నీతి శతకాల్లో ఎడనెడ కొంత నీతి కనిపిస్తున్నప్పటికీ స్త్రీల విషయంలో చాలా తప్పుడు భావాలను కలిగి ఉన్నాయి… సుమతీ, వేమన శతకాల్లో చాలా వరకు సంస్కృత శతకాల ప్రభావం ఉంది” అని కత్తి పద్మారావు గారు (భారతీయ సంస్కృతిలో స్త్రీ 1993: 172) అనటంలోనూ భావజాల ప్రభావం శతక కర్తల పై ఉందని తెలుస్తుంది.

సాధారణంగా ప్రతి సాహిత్యం ,సాహిత్య ప్రక్రియా ఆ సమాజ పరిస్థితులకు అణుగుణంగానే రూపొందుతుంది. అలాగే మన తెలుగు సాహిత్యం కూడా సృజనీకరించబడింది. కనక, ఆనాటి సమాజ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆ సాహిత్యాన్ని విమర్శించాలనే ఒక నియమం విమర్శకుల్లో ఉంది. ఆ పద్ధతిలో సాహిత్యాన్ని అంచనా వేయటమే సద్విమర్శ అవుతుంది . ప్రాచీన సాహిత్యమంతా పాతచింతకాయ పచ్చడని కొట్టేయడానికీ వీల్లేదు. కానీ , ‘గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్’ అంటే మాత్రం ఒప్పుకోలేరు ! ఎప్పుడూ ఒక కాలం లో వచ్చిన సాహిత్యం నుండి

అందరూ గ్రహించవలసినవి కొన్ని మాత్రమే ఉంటాయి. ఎప్పుడూ సర్వజన హితం, సర్వకాలయోగ్యంగా ఉంటాయని భ్రమించటం మాత్రం అవగాహన రాహిత్యమే అవుతుంది. ఆ అవగాహననే అందరిపై రుద్దాలనుకున్నప్పుడు సమస్యలు ఉత్పన్నం అవుతుంటాయి. ప్రాథమిక పాఠశాలల్లో నీతి పద్యాలు పెట్టాలనుకుంటున్నారు. మంచిదే. కానీ, ఎలాంటి పద్యాలు పెడతారో గమనించవలసి ఉంది. లేక పోతే చిన్న నాటి నుండే బాలబాలికల్లో విష భీజాలను నాటడానికి ప్రయత్నించడమే అవుతుంది. అది పెరిగి పెద్ద జెండర్ సమస్యగా మారుతుంది.

## పి. సత్యవతి గారితో ఇంటర్వ్యూ : మొదటి భాగం



విలక్షణమైన వస్తువుని అత్యంత స్పష్టతతో కథగా మలచగలిగిన శక్తిగల అతి కొద్దిమంది రచయితలలో సత్యవతి ఒకరు. సత్యవతి కథలు, ఇల్లలకగానే, మంత్రనగరి - మూడు కథా సంపుటాలు, మర్రినీడ, గొడుగు అనే రెండు నవలలు ప్రచురించారు. ఇవికాక అనేక వ్యాసాలు, అనువాద రచనలు చేశారు. ఇల్లలకగానే, సూపర్‌మామ్ సిండ్రోమ్ కథలు దాదాపు అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. తెలుగునాట విస్తరించిన స్త్రీవాద ఉద్యమ సాహిత్యానికి అనేక కొత్త కోణాలు అందించిన రచయిత్రిగా సత్యవతి సుపరిచితులు. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి, విజయవాడలో లెక్చరర్‌గా పనిచేసి రిటైరయ్యారు. చాసో అవార్డు, రంగవల్లి అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం అందుకొన్నారు.

* మీ బాల్యం, నేపథ్యం, జీవన యాత్ర గురించి చెప్పండి...

నేను గుంటూరు జిల్లా కొలకలూరు గ్రామంలో ఒక మధ్యతరగతి సంప్రదాయాలను పాటించే మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో పుట్టాను. అక్కడ పూజలు, పునస్కారాలు, పండుగలు, పబ్బాలు, చుట్టాలు-పక్కాలు... అట్లా అన్నీ ఆడవాళ్ళ వైపున, కులమతాల కతీతంగా ఉంటూ కాంగ్రెస్ స్నేహితులతో తిరుగుతూ ఊళ్ళో స్కూలు, లైబ్రరీ వంటి వాటికోసం కృషి చేసిన మా నాన్న ఒకవైపూ... ఒక మిశ్రమ వాతావరణం. మా కుటుంబాల్లో ఆరోజుల్లో (1950-60) ఆడపిల్లలకి చదువు లిమిట్. ఎస్.ఎస్.ఎల్.సి. ఆపైన పెద్దవాళ్ళే ఎవరో ఒకర్ని తెచ్చి వీలైనంత తక్కువ కట్నం ఇచ్చి చేతులు దులిపేసుకొనే ఆచారం. నేను చిన్నప్పుడు చాలా అమాయకంగా, బెదురుబెదురుగా, చాలా సెన్సిటివ్‌గా, ఎవరైనా ఏవన్నా అంటే ఏడ్చేలాగా, సినిమాలుచూసినా అందులో ఎవరైనా ఏడిస్తే నేనూ ఏడుస్తూ, నా కళ్ళ ఎదుట ఎవరైనా వాంతి చేసుకొంటే నేనూ తిన్నదంతా వెళ్ళబోస్తూ అచ్చం 'ఆడపిల్ల'లాగే ఉండేదాన్ని. మమ్మల్ని చీకట్లో ఒంటరిగా వెళ్ళనిచ్చేవాళ్ళు కాదు. ఇటువంటి ప్రారంభం నాది. అయితే మా అమ్మకి పుస్తకాలుచదివే అలవాటు బాగా ఉండేది. మా ఇంటికి ఇంగ్లీష్ పేపరు వచ్చేది. ఆంధ్రపత్రిక, ప్రభ, భారతి, యువ వంటి పత్రికలొచ్చేవి. ఆ విధంగా నాకు చదవడం బాగా వచ్చింది. అమ్మతో పాటు ఒక విడత చలం, బాపిరాజు, విశ్వనాథలవీ చదివాను. అన్ని పుస్తకాలు చదివినా అమ్మకొచ్చిన

కొత్త ఆలోచనలేవీ లేవు, నాకు పెరిగిన జ్ఞానమూ లేదు. కానీ ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూ ఉండకపోతే తోచని స్థితి ఏర్పడింది.

మా ఇంట్లో పెద్దవాళ్ళు చేసే నోములు, పూజలు పిల్లల మీద రుద్దేవాళ్ళు కాదు. అది మాకో పెద్ద ప్లస్ పాయింట్. మా పెద్దవాళ్ళు మాకసలు చనువే ఇచ్చేవాళ్ళుకాదు. మా నాన్నతో మాట్లాడ్డానికే మాకు భయం. నేను ఎస్.ఎస్.ఎల్.సి. కొచ్చేసరికి నాకు మా ఇళ్ళలో ఆడవాళ్ళ జీవన విధానం, వాళ్ళ పరిస్థితులు అర్థమవడం మొదలుపెట్టాయి. భర్తలతో కూడా పగలు ఎదుటపడి మాట్లాడలేని వాళ్ళు, కూరలు కొని, 'ఆయన ఇంట్లో లేరు. తరువాత రా డబ్బులిస్తారు,' అనేవాళ్ళు, స్కూలు చదువు అయ్యాక ఇంట్లో ఉండిపోయి వచ్చేపోయే పెళ్ళిచూపుల వాళ్ళ ముందు కూచుని కూచుని ఎవడో ఒకడికి నచ్చేదాకా ఎదురుచూసి... చూసి... ఇదంతా చాలా అవమానకరంగా అనిపించేది. అక్కడ్నుంచే నేను 'ఆడపిల్ల'గా ఉండకూడదనుకొన్నాను. మా నాన్న నన్ను కాలేజీలో చదువుకోవడానికి హైదరాబాదు పంపించారు. మా కుటుంబాలలో మొదట కాలేజీలో అడుగుపెట్టింది నేనే. అక్కడ మామయ్య వివేకవర్ధని కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా (పి.ఎస్. రావు) ఉండేవారు. తరువాత ప్రిన్సిపాల్ అయ్యారు. అసలే ఊరు దాటి వెళ్ళడం. హాస్టల్‌లో ఆడపిల్లని చేరటమే! అందుకని పక్కనున్న తెనాలి, గుంటూరు వదిలేసి మామయ్య దగ్గర ఉంచడం కోసం హైదరాబాదు పంపారన్నమాట... ఆరోజుల్లో ఆడపిల్లలని ఎక్కువగా బైపిసి.లో చేర్చేవాళ్ళు. చదివితే ఎం.బి.బి.ఎస్. చదవాలి. అందులో సీటు రాకపోతే ఇంటర్ కాగానే పెళ్ళి చేసెయ్యాలి. ఇట్లా ఉండేవి ఆలోచనలు. మా మాయ్యకి సాహిత్యం అంటే చాలా ప్రేమ. మంచి సినిమాలు చూడ్డం, సాహిత్యం చదవటం, ఆడవాళ్ళని గౌరవంగా చూడటం, అక్కచెల్లెళ్ళని ప్రేమించటం మొదలైన గుణాలన్నీ కల ఒక మగవాణ్ణి నేను చాలా దగ్గరగా చూసింది ఆయనలోనే. ఈరోజు నాకు అబ్బిన కాస్తో కూస్తో సంస్కారం, సాహిత్యం పట్ల మమకారం ఆ అక్క (మా అమ్మ), తమ్ముళ్ళ వల్లే... మా నాన్న దగ్గర మాకు చనువు లేకపోయినా మేము పుస్తకాలు, పత్రికలు కొనుక్కోనేందుకు ఆయన ఎప్పుడూ అభ్యంతరపెట్టలేదు. పైగా ఆయనే నాకు మంచి పుస్తకాలు చాలా కొనిపెట్టారు. నాలో ఉండే ఒక పల్లెటూరి ఆడపిల్లని, ఆలోచనవైపు మళ్ళించింది నా కాలేజి చదువు, హైదరాబాద్ నగరం, సీరియస్‌గా చదవడం మొదలుపెట్టాక నేను ఏరుకొని చదివిన పుస్తకాలు. ఒకచోట కె.వి.ఆర్.గారు చెప్పినట్లు మంచి పఠితనైన నేను ఒక రచయితని కాగలిగాను.

* మీ రచనలకి స్ఫూర్తినిచ్చిన, మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలు ఏమిటి? ఇంతవరకు చేసిన రచనల వివరాలు...

నేను చిన్నప్పట్నుంచీ కనబడ్డ పుస్తకమల్లా చదివేదాన్ని. పఠనీయత (రీడబులిటీ) ఉంటే చాలు పుస్తకం పూర్తయ్యేదాకా అట్లా చదువుకొంటూ పోవడమే... పాపులర్ నవలలు కూడా చదివేదాన్ని. అయితే నన్ను అమితంగా ఆకట్టుకొని, నిలబెట్టి, ఆలోచింపజేసిన మొదటి పుస్తకం కుటుంబరావుగారి 'కురూపి.' తరువాత వెతుక్కొని వెతుక్కొని కుటుంబరావుగారు ఏం రాసినా చదవడం మొదలుపెట్టాను. అప్పుడు నాకు ఆయన

మార్క్సిస్ట్ దృక్పథంతో వ్రాస్తారనిగాని, అలాంటి దృక్పథం ఒకటుందనిగాని తెలియదు. ఆయన చాలా ఎనలటికల్‌గా వ్రాస్తారనుకొనేదాన్ని. నేను హైదరాబాద్‌లో ఉండి కోఠీ ఉమెన్స్ కాలేజీలో చదివిన కాలం నా జీవితంలో ఓ గొప్పదశగా నేను భావిస్తాను. మామయ్య దగ్గర ఉండటం వలన తెలుగు, ఇంగ్లీషు సాహిత్యాలను గురించిన జ్ఞానం కొంత వచ్చింది. మామయ్య ఆంధ్రా యూనివర్సిటీ నుంచి తెలుగు, ఇంగ్లీష్ రెండింటిలో గోల్డ్ మెడల్స్ తీసుకొన్న వ్యక్తి. మా కాలేజీలో మంచి ఫిక్షన్ లైబ్రరీ ఉండేది. ఆంధ్రప్రభలో మాలతీచందూర్ పరిచయం చేసిన నవలలన్నీ అక్కడ దొరికేవి. నాకొక ప్రాపంచిక తాత్విక దృక్పథం ఏర్పడక ముందే నాకొక విషయం అర్థమైంది. అదేమిటంటే కుటుంబంలోగాని, సమాజంలోగానీ ఉంటున్న పరిస్థితి అట్లా ఉండకూడదు. అది మారాలి. ముఖ్యంగా స్త్రీల పరిస్థితి. నా దృష్టిలో అత్యంత అవమానకరమైనవి, హీనమైనవి పెళ్ళిచూపులు, పెళ్ళి బేరాలు. నా ప్రయాణం అక్కడనుంచే మొదలైంది. సైన్స్, సీరియస్ పాఠాలు నాకు పడక. నేను మా నాన్న ఆశ ప్రకారం డాక్టర్ని కాలేకపోయాను. గ్రాడ్యుయేట్‌ని కాగలిగాను. తరువాత ఇంగ్లీషు సాహిత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. నాకు రచనా స్ఫూర్తినిచ్చింది కుటుంబరావుగారు, రంగనాయకమ్మలు. తెలుగులో నన్ను ప్రభావితం చేసిన అంశాలు చాలా ఉన్నాయి. కథారచన ఒక్కటే 'మై కప్ ఆఫ్ టీ' అని తెలుసుకోలేకపోయిన నేను ముందు మూడు, నాలుగు నవలలు వ్రాశాను. అందులో 'గొడుగు' స్త్రీల లైంగికాసక్తి, వివాహేతర సంబంధాలు, వాటిని స్త్రీలు ఏ విధంగా తీసుకొంటారు, పురుషులు కొంతమంది ఎట్లా తీసుకొంటారనే అంశం మీద వ్రాశాను. ఆ నవల ఎమెస్కో వాళ్ళు డైరెక్ట్‌గా వేసినప్పుడు రాని స్పందన తిరిగి ఆహ్వానం మాసపత్రికలో వేసినప్పుడు వచ్చింది. ఇంతవరకు మూడు కథా సంపుటాలు ప్రచురించాను. రాసిన కాలం ఎక్కువ. రచనలు తక్కువ. తొంభై తొమ్మిది శాతం స్త్రీ కేంద్రక రచనలే.

* రచనలు చేయడం మీ అభిరుచా, జీవన విధానమా లేక భావోద్వేగమా... రచనలతో సంబంధం లేకుండా ఉండగలరా?

రచన నా అభిరుచి, ఊపిరి పీల్చే కిటికీ... అన్నీ... అయితే అది నా కెరియర్ మాత్రం కాదు. భావోద్వేగం లేనిదే రచన రాదని నేననుకొంటాను. పఠనం, రచన వీటితో సంబంధం తెగిపోతే ఇంక జీవితం ఆగిపోయినట్లే లెక్క.

* మీ కథావస్తువు, శిల్పాల వెనుక ఉండే ఆలోచనా స్రవంతిని వివరిస్తారా.

వస్తువే శిల్పాన్ని ఎంచుకొంటుందని నేననుకొంటాను. ఒక్కొక్క కథని తగ్గ శిల్పంలో చెబితేనే ప్రతిభావంతం కారాదు. చెప్పదలచిన విషయాన్ని ఎఫెక్టివ్‌గా చెప్పలేం. సాదాగా చెప్పినా, 'చెక్కి'నా కథనంలో స్పాంటేనిటీ ఉండాలి. కష్టపడి వ్రాసినట్లుకాక ధారలాగా సాగాలి. వస్తుశిల్పాలకి సమ ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదీ డామినెంట్‌గా ఉండకూడదు. ఆ సమతౌల్యం మనకి కొందరు రచయితలు వ్రాసిన కొన్ని కథల్లో కనిపిస్తుంది. కథని అర్థం చేసుకోవడానికి మూడు నాలుగుసార్లు చదవాలంటే కష్టం. వస్తువు ప్రయోజనకరమైంది కానప్పుడు శిల్ప

చమత్కృతి వ్యర్థ క్రియ. అట్లాగే మంచి వస్తువును ఎక్కువమందికి అర్థంకాని శిల్ప ప్రయోగాలతో పాఠకుల్ని ఇబ్బంది పెట్టడం కూడా మంచిది కాదు... కథ పాఠకులకి అర్థం కావాలనేదే నా అభిమతం.

* నేడు వస్తున్న కథ గురించి, అట్లాగే విప్లవ కథ గురించి మీ అంచనా...

గడచిన రెండు దశాబ్దాలలో మంచి కథలు, కథా సంకలనాలు గణనీయంగా వచ్చాయి. పత్రికలు కొన్ని సీరియస్ కథల్ని ప్రోత్సహించాయి. అన్ని ప్రాంతాల నుంచీ అన్ని మాండలికాలలో ఎన్నదగ్గ కథలొచ్చాయి. ఇప్పుడు కొంచెం వేగం తగ్గిందేమోననిపిస్తోంది. రచనని సీరియస్‌గా తీసుకొని ఇంకా కొంతమంది యువ రచయితలు బాగా వ్రాస్తున్నారు. పెరిగిన జీవనవేగం, తగ్గుతున్న జీవన నాణ్యత, ప్రపంచీకరణ దుష్ఫలితాలు, అంతరించిపోతున్న వృత్తులు, పలచబడుతున్న మానవ సంబంధాలు, అవి కాపాడుకోవడానికి చేస్తున్న వివిధ ప్రయత్నాలు, నానాటికీ పెరుగుతున్న సామాజిక అంతరాలు, కులాలు, మతాలు, అభద్రతా భావాలు... ఇట్లా సంక్లిష్టమైపోతున్న జీవితాన్ని చిత్రిస్తున్న కథలు వస్తున్నాయి. వస్తు శిల్పాలు రెండింటిలోనూ ఎంతో అధిగమనం చూస్తున్నాం. అట్లాగే విప్లవకథ కూడా శిల్పం అవసరాన్నిప్పుడు గుర్తించింది. శిల్పరీత్యా, వస్తువురీత్యా కూడా కడచిన ఇరవై ఏళ్ళుగా చాలా గొప్పగా చెప్పిన కథలు వచ్చాయి. కథల పోటీలు కొన్నింటిలో కూడా మంచి కథ వ్రాయాలనే నిజాయితీతో కూడిన ప్రయత్నం కనబడింది. రచయితల దృష్టి వైశాల్యము, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్య విశ్లేషణా, లోతూ కూడా పెరిగాయి.

* ప్రపంచీకరణ నేపథ్యంలో వస్తున్న సాహిత్యంపై మీ అంచనా...

ప్రపంచీకరణ ఒక అనివార్య పరిణామం. దీని మీద 'అయ్యో అయ్యో' అనుకోవడం కూడా అనివార్యమే. మొదట్లో అటుగానే స్పందిస్తాం. కానీ ఇప్పుడు ఆ దశని దాటి ప్రపంచీకరణ దుష్ఫలితాలను ఎదుర్కొనే ప్రత్యామ్నాయాలను గురించి ఆలోచించాలి. సంస్కృతులను కాపాడుకోవడం అంటే భోగిమంటలు, గంగిరెద్దులను ప్రవేశపెట్టడం కాదు. కోల్పోతున్న విలువల్ని రక్షించుకోవాలి. పెరుగుతున్న అంతరాలను పూడ్చగలగాలి. వ్యక్తి కేంద్రంగా మారుతున్న సంస్కృతిని సమష్టి వైపు మరల్చ గలగాలి. రచయితలు ఆ వైపు నుంచి ప్రపంచీకరణను చూడాలి. ఇప్పటిదాకా, 'ఇలా ఉంది,' అని చెప్పాం. ఇప్పుడు ఎలా ఉంటే బాగుంటుందో సూచించే సాహిత్యం రావాలి. విక్టిమ్ నుంచి సర్వైవర్ దిశగా వెళ్ళే ప్రయత్నానికి రచయిత దారి సూచించాలి. ఉదాహరణకి ఖదీర్‌బాబు న్యూ బాంబే టైలర్స్ కథ, ఇటీవల వచ్చిన సన్నపురెడ్డి నవల తోలుబొమ్మలు అలాంటి రచనలలో కొన్ని.

* అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో వచ్చిన సాహిత్యం...

అస్తిత్వ ఉద్యమాలు తెలుగు సాహిత్యాన్ని సంపద్వంతం చేశాయనడంలో సందేహం లేదు. స్త్రీవాద సాహిత్యం పురుష కేంద్రంగా సాగుతున్న సంస్కృతిని, శతాబ్దాల తరబడి రాజ్యమేలుతున్న భావజాలాన్నీ నిలదీసి

ప్రశ్నించింది. హక్కుల్ని తిరిగి తీసుకొనే సఫల ప్రయత్నం చేసింది. స్త్రీలు స్త్రీలుగా పుట్టినందుకు, శాంతి క్షమ వంటి గుణాలు కలిగి ఉన్నందుకు గర్వపడేలా ఆలోచనలను రేకెత్తించింది. స్త్రీల శరీర ధర్మాల గురించి, స్త్రీత్వం గురించి ప్రచారంలో ఉన్న భ్రాంతి, భావనలను (మిత్స్) చెదగొట్టింది స్త్రీవాద రచన. అందువల్ల సమాజంలో అద్భుతమైన మార్పు వచ్చిందనే భ్రమ అయితే లేదుగానీ, స్త్రీలు మాట్లాడగలుగుతున్నారు. రచయితలు, ఉపన్యాసకులు (సినిమావారు తప్ప) స్త్రీలను కించపరచే తిట్లను, భాషను వాడడానికి పూర్వంలా ముందుకు రావడం లేదు. అలాగే శక్తిమంతమైన దళితవాద రచనలు వచ్చాయి. మైనారిటీ, ప్రాంతీయ వాదాల నేపథ్యంలో కూడ వచ్చాయి. ఎంత సాహిత్యం వచ్చినా ఉద్యమాలు రాజకీయంగా విజయవంతం అయితే తప్ప ఆశించిన ప్రయోజనాలు రావు. మాట్లాడగల వారికి మాట్లాడే అవకాశాలు లేకుండా చెయ్యడం, మాట్లాడని వాళ్ళకి అలంకార ప్రాతినిధ్యాల్నివ్వడం, వెనక నుంచి కథ నడపడం, యథాశక్తి కొనసాగించడానికి వీలైనంత సహకరించడం స్త్రీల విషయంలో జరుగుతున్నది. చదువు, ఉద్యోగం, ఆర్థిక స్వాతంత్ర్యం కల కొద్దిమంది స్త్రీలను పక్కనపెడితే ఇంకా నిరక్షరాస్యులైన గ్రామీణ స్త్రీలు, అవ్యవస్థీకృత రంగంలో పనిచేసే స్త్రీలు... వీరికి ఏ వాదమూ దగ్గరకు తీసుకొనే స్తోమత లేదు. కులము, ఆర్థికము, వేళ్ళు పాతుకు పోయిన నమ్మకాలు వీళ్ళ జీవితాలను నిర్దేశిస్తున్నాయి. దళిత, మైనారిటీ మహిళల నుంచి విస్తృతంగా సాహిత్యం రావాలి. రావాలంటే విద్యావకాశాలు అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో విద్య ఖరీదు పెరిగి, అది సొంతం వ్యాపారంగా మారింది. లింగ, వర్గ, కుల వివక్షల్ని ఎదుర్కొంటూ జీవన పోరాటం చేసే స్థితి మారలేదు. దళిత, మైనారిటీ స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు తగ్గనపుడు ఎంత సాహిత్యం వచ్చినా ప్రయోజనం ఉండదు. ఉద్యమ సాహిత్యాన్ని ప్రజలలోకి తీసుకు వెళ్ళే ప్రయత్నం చెయ్యాలి.

* గత దశాబ్దంలో వచ్చిన సాహిత్యంలో వస్తుశిల్పాలు పరిణామం పరిణతి...
ఈ ప్రశ్నకీ పైన చెప్పాను.

* ఒకప్పుడు వెయ్యి పేజీల గోదాన్, వార్ అండ్ పీస్ వంటి పుస్తకాలు చదివాం. మారుతున్న కాలంలో జనం చదివే అలవాట్లు

అప్పుడు టి.వి., ఇంటర్నెట్, పిల్లల్ని ఎంసెట్‌కి రుద్దడం, చాలా చాలా కొనుక్కోవడం, మనని మనం విజయవంతంగా అమ్ముకోవడం, నిచ్చెనలెక్కడం ఎలా ఆలోచించడం వంటి కార్యక్రమాలు లేవు. ఇప్పుడున్నంత peer pressure కూడా లేదు. ఇప్పుడు మనం ఈ ముఖ్యమైన పనులతో పాటు వెయ్యేసి పేజీల పుస్తకాలు చదవలేం కదా! 'వార్ అండ్ పీస్' దాకా ఎందుకు, ఇప్పుడు విక్రమ్ సేట్ మళ్ళీ ఒక 'సూటబుల్ బోయ్' వ్రాస్తే ఏ పబ్లిషరూ వెయ్యడు. మనమూ అంత ఓపిక చూపించలేం... క్లుప్తత కోరుకోవడంలో తప్పు లేదు. అలా అని చెప్పదలచినదంతా చెప్పకోలేకపోవడమూ ఇబ్బందే. కనుక చెప్పదలుచుకొన్న విషయాన్ని క్లుప్తంగా పఠనీయంగా, అందంగా ఎట్లా చెప్పాలనే అంశం మీద రచయితలు కృషి చెయ్యాలి. ఒకప్పటిలాగా ఇప్పుడు విజ్ఞానం కోసం కాలక్షేపం కోసం పుస్తకాలొక్కటే సాధనం కాదు కదా! సాహిత్యానికి మనోరంజనం ఒక్కటే

ధ్యేయం కాదు. సాంఘిక ప్రయోజనం ఉండాలని కోరుకొనేటప్పుడు, ఆ సాహిత్యం క్లుప్తంగా గాఢంగా మనసుని స్పృశించేదిగా ఉండాలి. ఇప్పటి అవగాహనతో తిరిగి పాత పెద్ద పుస్తకాలు చదివితే కొంత superfluity కనబడవచ్చు.

* ప్రశ్నించటం నేరమౌతున్న కాలంలో రచయితల కర్తవ్యం ఏమిటి?
స్వయంగా ప్రశ్నించలేని వాళ్ళు కూడా ప్రశ్నించేవారికి మద్దతు ఇవ్వాలి. ప్రశ్నించకుండా ఉండడానికి మాత్రం ప్రయత్నించకూడదు.

* రచయితకి సామాజిక చైతన్యం ఎంత అవసరం?
స్వయంగా సామాజిక, రాజకీయ చైతన్యం లేనివాళ్ళు ఎవరికి మాత్రం ఏం చెప్పగలరు? సామాజిక చైతన్యమే మామూలు వ్యక్తిలోని రచయితను వెలికి తీస్తుంది.

* * *

## పి. సత్యవతి గారితో ఇంటర్వ్యూ : రెండవ భాగం

* సారా ఉద్యమం గురించి.....

సారా ఉద్యమ వైఫల్యం స్త్రీలకొక నమ్మకద్రోహం... ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాలకి వాడుకోవడం మాత్రమే జరిగింది. ఇవ్వాళ సారా సర్వాంతర్యామి. కళాశాలల్లోకి, గ్రామాల్లోకి, మురికివాడల్లోకి విపరీతంగా విస్తరించి మహిళా సాధికారత అని మనం బాకా ఊదుకొనే అంశాన్ని చావుదెబ్బ కొట్టింది. గృహహింస పెరిగింది. నేరాలు పెరిగాయి. స్త్రీల మీద అధిక భారం పడింది. మనిషిని ఆలోచనకి, వివేకానికి దూరం చేసింది. ప్రస్తుతం జలయజ్ఞం సంగతేమో కాని సారా యజ్ఞం మాత్రం జయప్రదంగా జరుగుతోంది.

* ఆంధ్రప్రదేశ్ లో వచ్చిన స్త్రీవాద ఉద్యమాలపై మీ అభిప్రాయం...

సంస్కరణోద్యమం స్త్రీలను మూఢాచారాల నుంచి నాలుగుగోడల చీకటి నుంచీ వెలికి తేవడానికి ప్రయత్నించింది. చదువుకొన్న భార్యగా మంచి తల్లిగా ఇంటి లెక్కలు చూసుకోగల తెలివిగల గృహిణిగా తయారుచేసే ప్రయత్నం చేసింది. జాతీయోద్యమం స్త్రీలు కొంతమందికి రాజకీయ చైతన్యం కలిగించింది. 1975 తరువాత మనదేశంలో ప్రాచుర్యంలోకి వచ్చిన స్త్రీవాద ఉద్యమం స్త్రీగా ఆమె శరీర ధర్మాల నుంచి ఆమె మేధో సంపద, ఆమె లైంగికాసక్తి, ఆమె స్పేస్ మొదలైన అనేక అంశాలను చర్చకు పెట్టింది. వ్యక్తిగతమంతా రాజకీయమేననీ, స్త్రీల అణచివేత మూలాలు పితృస్వామ్యవ్యవస్థలోనే ఉన్నాయనే సిద్ధాంతంతో ముందుకొచ్చింది.

* స్త్రీలు ఉత్పత్తిలో భాగం అవుతున్నా వారి సమస్యలు తొలగడం లేదు. పితృస్వామ్యం, వరకట్న దురాచారాలు, మహిళల అభివృద్ధికి ఆటంకాలవుతున్నాయి. సంస్కరణోద్యమం ఆచరణలో విఫలమౌతున్నది. ఈ సమస్యలకి పరిష్కారమేమిటి? భారతదేశంలోను, అమెరికాలోను గృహహింస పెరగడానికి కారణం ఏమిటి? తొలగించడంలో సాహిత్యం పాత్ర ఏమిటి?

ఉన్నత, మధ్యతరగతి వర్గాల స్త్రీలు ఇవ్వాళ చదువుకొని ఉద్యోగాల్లో కొచ్చారుగానీ, అడుగువర్గంలోని స్త్రీలు చిరకాలంగా ఉత్పత్తిలో భాగస్వాములే. కానీ అన్నిరకాల హింసలకీ, వివక్షలకీ వారే ఎక్కువ అందుబాటులో ఉంటారు. పై వర్గాల కులాల స్త్రీలకి కొంత భద్రత, రక్షణ ఉంటాయి. జీవనం కోసం తప్పనిసరిగా బయటికి వచ్చి తీరవలసిన వీళ్ళకి రక్షణ ఎటువైపు నుంచీ కూడా లేదు. స్త్రీలపై, దళితులపై సహజంగా పాతుకుపోయిన చిన్నచూపు, న్యాయపరమైన రక్షణ లేకపోవడం, ఇంకా వదిలిపోని ఫ్యూడల్ భావజాలజాడ్యం, ఇవన్నీ పనిగట్టుకొని కాపాడుకొన్నంత కాలం స్త్రీల పరిస్థితి ఇంతే. స్త్రీలు తమ స్థానాన్ని తాము స్థిరపర్చుకొనే ప్రయత్నం చెయ్యాలి. మాట్లాడాలి. అయితే అణిగి ఉండడాన్ని అలవాటు చేసిన వర్గాలు మాట్లాడడం మీద ఇన్నాళ్ళుగా అనేక ప్రత్యేక సదుపాయాలకు అలవాటు పడ్డ వాళ్ళకి ఒక అభద్రతతో కూడిన అసహనం

ఉంటుంది. అప్పుడే 'ఎక్కడ ఉండవలసిన వాళ్ళని అక్కడ ఉంచే' ప్రయత్నం మొదలవుతుంది. స్త్రీలు సమానంగా చదువుకోవడం, సంపాదించడం, మాట్లాడడం, చర్చించడం, నిర్ణయాలు తీసుకోవడం, తమ స్పేస్‌ని సృష్టించుకోవడం మొదలైనప్పుడు ఈ అసహనం గృహహింస రూపంలో బయటపడుతుంది. ఉద్యోగభద్రత లేకపోవడం, బయటి వత్తిళ్ళ నుంచి విడుదల కోసం కూడా గృహహింస జరుగుతుంది. స్త్రీని తోటి మనిషిగా, స్నేహితురాలిగా గుర్తించే సంస్కారం అలవడనంతవరకూ పరిస్థితి మారదు. ఆల్కహాలిజం, వినిమయ సంస్కృతి కూడా దోహదకారులే. పెళ్ళి పట్ల, సహజీవనం పట్ల ,స్త్రీ పురుష సంబంధాల పట్ల ఇప్పటికింకా మారని భావజాలం కూడా గృహహింస తగ్గకపోగా, పెరడానికి కారణం. స్త్రీని తమకు చెందిన ఒక వస్తువుగా పరిగణించే స్వభావం ఉన్నంతకాలం వారిపై పెత్తనం, ఆధిక్యం ప్రదర్శించుకొనే క్రమంలో హింసా తప్పవు. ఈ పరిస్థితి మారాలంటే స్త్రీలు ఆర్థికంగా స్వతంత్రులై ఉండడంతో బాటు అందుబాటులో కొచ్చిన చట్టాలను ఉపయోగించుకోగలగాలి. సెంటిమెంట్లకి స్వస్తి చెప్పాలి. ముఖ్యంగా ప్రధాన స్రవంతి ప్రసార మాధ్యమాలైన టి.వి.., సంచలనాత్మక వార్తా కథనాలతో, ధారావాహికలతో అత్యధికంగా అమ్ముడుపోయే పత్రికలూ వాటి ధోరణి మార్చుకోవాలి. హింసించే భర్త పట్ల విధేయత తప్పు అని అర్థం కావాలి. మార్కెట్ సంస్కృతి అనేక హింసలకు మూలమౌతున్నది.

* మన సాహిత్యంలో రంగనాయకమ్మగారి పాత్రని ఎట్లా అంచనా వేస్తారు?

నేటి స్త్రీవాదానికి పునాదులు వేసినవాళ్ళు చలం, కుటుంబరావు, రంగనాయకమ్మలు... ఫెమినిస్టు సిద్ధాంతాలు పాశ్చాత్య దేశాలలో పుట్టినా, ఆంధ్రదేశంలో స్త్రీవాదం అనే మాట వినబడక ఎంతో ముందు స్త్రీల గురించి ఆవేదనపడినవాళ్ళు, వాళ్ళు... స్త్రీలు చైతన్యవంతులై, హక్కులు బాధ్యతలు కల పౌరులుగా మనుగడ సాగించాలనే ఆర్తితో తెలుగులో, అప్పుడు బహుళ ప్రాచుర్యంలో ఉన్న రచయిత్రులకి భిన్నంగా ఒక కొత్తచూపునిచ్చిన రచయితగా ఆవిడది తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం... స్త్రీల చైతన్యం గురించి 'జానకి విముక్తి' చేసిన చర్చ చాలామందిని ఆలోచింపజేసింది. ఆమె సునిశిత పరిశీలనాశక్తి కథని ఆడంబరరహితంగా చెప్పి ఆలోచనకు స్ఫూర్తినిచ్చే నైపుణ్యం ఇటీవల ఆమె వ్రాసిన 'మురళీ వాళ్ళమ్మ' కథలో చూడవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన మంచి కథ.

* మహాశ్వేతాదేవి రచనలపై మీ అంచనా...

రచనకీ, ఆచరణకీ మధ్య అంతరంలేని మహా వ్యక్తి. ఆవిడ వ్రాసిన 'ద్రౌపది' కథ ఒక్కటి చాలు. హజార్ చౌరాసీమా, రుడాలీ వంటి రచనలు చదివినప్పుడు ఆవిడకు రావలసినంత అంతర్జాతీయ గుర్తింపు ఎందుకు రాలేదో అర్థం కాదు.

* ఆధునిక తెలుగు సాహిత్యంలో ముఖ్యమైన రచయిత్రులు...

'ముఖ్యమైన' అనడం కన్నా బాగా వ్రాసిన, వ్రాస్తున్న అంటే బాగుంటుందేమో. అప్పుడు వ్రాసిన వసుంధరాదేవి, కల్యాణసుందరి, ఆచంట శారదాదేవి, వాసిరెడ్డి సీతాదేవి, రామలక్ష్మి, డాక్టర్ శ్రీదేవి... ఇప్పుడు వ్రాస్తున్న ఛాయాదేవి, చాగంటి తులసి, ఓల్గా, కుప్పిలి పద్మ, సుజాతారెడ్డి, గీతాంజలి, కె. వరలక్ష్మి, ప్రతిమ, రుక్మిణి, చంద్రలత, జాజుల గౌరి, జూపాక సుభద్ర, వినోదిని, ఎస్. జయ... వీళ్ళంతా ఆధునిక తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన, చేస్తున్నవారే. అట్లాగే రేవతీదేవి, జయప్రభ, విమల, కొండేపూడి, ఘంటసాల నిర్మలలు, స్వరూపరాణి, షాజహానా, మహెజబీన్, హైమవతి, కె. గీత, శిలాలోలిత, సుజాతా పట్వారీ, ఎస్. జయ, అనిసెట్టి రజిత, ఆదూరి సత్యవతి మొదలైనవారు... ఫెమినిస్టు సాహిత్య విమర్శ చేస్తున్న కాత్యాయనీ విద్మహే, నిర్మొహమాట విమ్మకురాలు చూపు కాత్యాయని, తెలుగులో వ్యంగ్య హాస్య కాలమిస్టు మృణాళిని, స్త్రీవాదన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తున్న భూమిక పత్రిక .. వీరంతా వర్తమాన తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నవారిలో కొందరు.

* ఫెమినిజం ఉద్యమంపై మీ అంచనా...

ఫెమినిజం ఒక ప్రాపంచిక తాత్త్విక దృక్పథం. దాని ఆధారంగా వచ్చింది ఫెమినిస్టు ఉద్యమం. స్త్రీ పురుషుల మధ్య ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత ఉండాలనీ, ఒక వ్యక్తి సామాజిక గుర్తింపు ఆ వ్యక్తి లింగాన్ని బట్టి నిర్ణయించరాదనేది ఫెమినిస్టు సిద్ధాంతం. పాశ్చాత్య దేశాలలో ఓటు హక్కు కోసం ప్రారంభమై, అనేక దశలు దాటి అనేక శాఖలుగా విస్తరించింది. ఏ ఫెమినిజమైనా స్త్రీలకి ఆర్థిక నిర్ణయాధికారం తన శరీరం మీద లైంగికత మీద తనకి అధికారం, జీవన నాణ్యతలను కోరుతుంది. ఫెమినిస్టులు ఆశించిన జీవన నాణ్యత స్త్రీలందరికీ వర్గ వర్ణాతీతంగా లభించలేదు. దిగువ మెట్ల మీది స్త్రీల జీవితాలు యధాతథంగానే ఉన్నాయి. ఫెమినిజం ఉన్నత, మధ్య తరగతి విద్యావంతులైన స్త్రీల ఉద్యమం అన్న విమర్శ ఉంది. ఫెమినిజం రచనలకే పరిమితం కాకూడదు. కార్యకర్తలను తయారుచేసి గ్రాస్ రూట్స్‌లోకి తీసుకెళ్ళాలి. స్త్రీలను సంఘటిత పరచగలగాలి. ఉద్యమం పూర్తిగా సమాజాన్ని మార్చిందని అనను కానీ చాలా ఫలితాలను సాధించింది.

* ఆంధ్రప్రదేశ్‌లో సామాన్య మహిళల జీవితాలపై ఫెమినిస్టు సాహిత్యం ఏమైనా ప్రభావాన్ని చూపించిందా?

ఫెమినిస్టు సాహిత్యం ఉధృతంగా వచ్చిన 80 దశకంలో మెయిన్ స్ట్రీమ్ దిన పత్రికలు, వార పత్రికలు బాగా ప్రోత్సహించి ప్రచురించాయి. స్త్రీల ప్రత్యేక పేజీలలో స్త్రీవాద కవితలు, వ్యాసాలు ముమ్మరంగా వచ్చాయి. సాహిత్య పత్రికలు మేగజైన్ల కన్న దినపత్రికలకి పాఠకులెక్కువ కనుక ఆ కాలంలో సామాన్య మహిళను కూడా స్త్రీవాదం కొంత ప్రభావితం చెయ్యగలిగింది. ఇప్పుడు చర్చలు, వ్యాసాలు ప్రత్యామ్నాయ పత్రికలకే పరిమితమయ్యాయి. అంతేకాక అప్పటికన్న ఇప్పుడు చదువరుల సంఖ్య బాగా తగ్గింది. ఉన్న ప్రభావాన్ని కూడా తుడిచిపెట్టడానికి టి.వి. ధారావాహికలు మెయిన్ స్ట్రీమ్ పత్రికల్లో స్త్రీల పేజీలు, మార్కెట్ సంస్కృతి శక్తి

కొద్దీ ప్రయత్నిస్తున్నాయి. ఫరవాలేదు సామాన్య మహిళలని స్త్రీవాద సాహిత్యం బొత్తిగా ప్రభావితం చెయ్యలేదని చెప్పలేము. పుస్తకాలతో పరిచయం ఉన్నవాళ్ళు ప్రభావితమయ్యారనవచ్చు.

* కొత్త తరం రచయితలు కనిపిస్తున్నారు కానీ రచయిత్రులు కనిపించడంలేదు. ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తారా? కారణాలు ఏమిటి?

తప్పకుండా ఏకీభవిస్తాను. నేటి యువతులని మూడు వర్గాలుగా విభజిస్తే మూడో వర్గంలో ఉన్న సమస్యలు చాలావరకు ఆర్థిక సామాజిక కుల పరమైనవి. చదువు, సరైన గృహవసతి, సాంఘిక భద్రత, న్యాయపరమైన రక్షణా లేని వర్గం, ఇంకా మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు, బాలింత మరణాలు, మగపిల్లల కోసం ఎక్కువమందిని కనడం, పోషకాహార లోపం, మగవాళ్ళ తాగుడు... ఇట్లా అభివృద్ధి వెలుగు తాలూకు క్రీనీడల్లో ఉన్న వర్గం... వీళ్ళు రాయలేరు. రెండవ వర్గం కింద మధ్య తరగతి. ఇక్కడ ఆడపిల్లలకి అనేక కట్టడులు. ఇల్లు, బడి, కాలేజి. ఇంట్లో పని. పెళ్ళి కోసం ఎదురు చూడడం. పుస్తకాలు, పేపర్లు, ఇంటర్నెట్ అందుబాటులో ఉండవు. జీవనోత్సాహం, ఆలోచనలు, స్నేహాలు, సమావేశాలు, ప్రయాణాలు, పరిశీలనలు, అందని విషయాలే. ఆడపిల్ల జీవన పరమావధి ఇంకా వివాహమే. ఆ వర్గం నుంచి వచ్చిన కిందటి తరం రచయిత్రులున్నారు. అప్పటి జీవన విధానం వేరు. ఇప్పటిది వేరు. పాఠశాలల్లో కాని కళాశాలల్లో కాని సృజనాత్మకతను ప్రోత్సహించే వాతావరణం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలే లేనప్పుడు గ్రంథాలయాన్ని ఆశించడం పేరాశే కదా. ఇక ప్రైవేటు విద్యాసంస్థలు మార్కులు తెచ్చుకొనే 'ప్రొడక్ట్స్'ని తయారుచేసే ఫ్యాక్టరీలయిపోయాయి. విద్యార్థుల్లో సృజన్మాకతని ప్రోత్సహించగల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అతి ఖరీదైన సోకాల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో మాత్రమే ఉంది. ఇంటి దగ్గర వాతావరణం కూడా అంతంత మాత్రమే. వెలిగిపోతున్న భారత పుత్రికల నుంచి సాహిత్య సృష్టి అందుకే జరగడం లేదు. ఇక మొదటి వర్గం కెరియర్ మీద, తగిన వరుణ్ణి సంపాదించడం మీద దృష్టి నిలుపుతోంది. రచయితలకి కూడా పై బాధల్లో చాలావరకు ఉన్నా వారికి స్వతంత్రంగా బయటికి వెళ్ళి మిత్రుల్ని కలిసి చర్చలు చేసే వెసులుబాటు ఉంది. ఇంకా స్త్రీల విషయంలో వర్జీనియా ఉల్ఫ్ చెప్పిన స్వంత గది, స్వంత డబ్బు కలిగుండే అవకాశాలు లేవు. నిలబడి ఆలోచించగల స్థిమితం లేదు. అందుబాటులో ఉన్న కాలహరి టి.వి. యువతుల్ని తిరిగి స్టీరియోటైప్‌గా మారుస్తోంది. పాపులర్ పత్రికలు ప్రకటనలతో మెదళ్ళు తినేస్తున్నాయి. కర్ణుడి చావుకున్నన్ని కారణాలున్నాయి.

* కథలపై ఉన్న ఆసక్తి రచయిత్రులకి కవిత్వంపై లేదేమో! కవయిత్రులను తయారుచేయడం ఎలా?

మంచి కవిత్వం రాసిన స్త్రీల కవులు అప్పుడూ ఇప్పుడూ చాలామందే ఉన్నారు. స్త్రీలను తయారుచేసినట్లు కవయిత్రులను తయారుచేయలేం. స్త్రీలు పుట్టరు తయారుచేయబడతారు. కానీ కవయిత్రులు పుడతారు, తయారవరు.

* తెలుగులో తొలి కథ వ్రాసింది బండారు అచ్చమాంబ అంటున్నారు కదా, అది గ్రాంథికంలో వ్రాసిన కథ కదా? అయినా గురజాడతో పోలికేమిటి?

తొలి కథ అన్నారే కానీ ఆయనతో పోలిక తేలేదు కదా! తొలి కథ బండారు అచ్చమాంబగారిదేనని అన్వేషి లలితగారు నిరూపించారు. గ్రాంథికంలో వ్రాసిన మాత్రాన అది కథ కాకుండా పోలేదు కదా... తొలి వ్యవహారిక భాషా కథగా గురజాడ కథని చెప్పుకోవచ్చు.

* అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి...

కార్మిక మహిళల హక్కుల కోసం ప్రారంభమైన మహిళా దినం కార్పొరేట్ సంస్థలు తమ ఉత్పత్తుల ప్రచారానికి వాడుకొనే స్థితికి దిగింది... ఇటీవల మా ఊళ్ళో ఒక యాబై కిట్టీ పార్టీ సంస్థలు కలిసి ఆడంబరంగా అంతర్జాతీయ మహిళా దినం జరిపి తంబోలా వంటివి నిర్వహించాయి. ఇక పాండ్స్ వంటి కంనీలు తమ లిప్‌గ్లాస్ ప్రకటనల్తో మహిళలకి శుభాకాంక్షలు చెబుతాయి. అయితే బాధ్యత గల కొన్ని మహిళా సంఘాలు స్త్రీ చైతన్య సమావేశాలు జరిపి వెండి అంచులను గుర్తు చేస్తున్నాయి. వేగంగా ముందుకుపోయే ప్రయత్నాన్ని అంత వేగంగానూ అడ్డుకొనే ప్రయత్నాలుంటాయి. అయితే వాటిని ఎదుర్కొని నెమ్మదిగానైనా ముందుకే పోతాంగాని, వెనక్కి పోమనేది చారిత్రక సత్యం.

* గృహకృత్యాలు విలువ కట్టడంలో స్త్రీవాదులకి స్పష్టత అవసరం...

ఆ విషయంలో స్త్రీవాదులు స్పష్టంగానే ఉన్నారు. కొన్ని పనులు హీనమైనవని, అవి స్త్రీల పన్లనీ, కొన్ని పురుషుల పన్లనీ అనడాన్ని స్త్రీవాదులు ఒప్పుకోరు. ఇంట్లో ప్రజాస్వామ్యం నెలకొల్పితే వీధిలో విధానసభలో కూడా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందంటారు. ఏ పని అయినా ఎవరైనా చేయవచ్చు వీలుని బట్టి, వీలు కల్పించుకొని. కుటుంబంలో ప్రజాస్వామ్యం, సమానత్వం, ప్రేమ, స్నేహం ఉన్నప్పుడు పనులకు విలువలు కట్టే ప్రసక్తే రాదు…… it all depends on caring and sharing.

మాక్సిమ్ గోర్కీ 'అమ్మ' నవల: సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాదు - డా. దార్ల వెంకటేశ్వరరావు



మానవుడు ఉన్నతత్వం సాధించే పరిణామాన్ని వర్ణించిన నవల మాక్సిమ్ గోర్కీ 'అమ్మ' నవల అని ప్రజా సాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అన్నారు . 09 - 03 - 2007 సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాదు లో జరిగిన సమావేశంలో 'అమ్మ' నవలపై ప్రత్యేక సంచికను ఆవిష్కరించి ముఖ్య వక్తగా ఆయన మాట్లాడారు . వ్యష్టి నుండి సమష్టికి పయనించటమే 'అమ్మ' నవల ధ్యేయం అని చెప్పారు.

గోర్కీ బాల్యమే ఒక నవల వంటిదని చెప్తూ ఆయన జీవిత సంగ్రహాన్ని వివరించారు . సమాజంలో ఉన్న 'చేదు' ని బయటపెడ్తానని తన పేరును గోర్కీ అని మార్చుకున్నాడని ఆయన చెప్పారు. అమ్మ నవల తెలుగులో గోపీచంద్, రావిశాస్త్రి తదితర రచయితలపై తీవ్ర ప్రభావాన్ని చూపిందనీ, ఆ ప్రభావం వాళ్ళ రచనల్లో కనిపిస్తుందనీ వివరించారు . 'అమ్మ' నవలలో- సామ్యవాద వాస్తవికత, మార్క్సిస్ట్ మౌలిక సూత్రాలను రచయిత చక్కగా సామాన్యునికి కూడా అర్థమయ్యేటట్లు సృజనీకరించారని సోదాహరణంగా వివరించారు .నిజానికి 'అమ్మ' నవల నేటికీ సాహిత్యంలో బ్రతికే ఉందనీ కానీ , సామాజిక పోరాటాల్లో దాని ప్రభావం సాహిత్యంలో కనిపించినంతగా లేదనీ ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దాని అవసరం ప్రపంచ వ్యాప్తంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు . 'అమ్మ' నవలలో ఆయన చెప్పిన మార్క్సిస్ట్ సూత్రాల , సామ్యవాద వాస్తవికతలను సమన్వయించిన తీరు విద్యార్థులను బాగా ఆకట్టుకుంది .

కార్యక్రమంలో ముందుగా "జనసాహితి " నగర శాఖ అధ్యక్షులు డా. లక్ష్మీనారాయణ భట్టు మాట్లాడుతూ జనసాహితి నివేదికను సమర్పించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత కళాకారుడు ప్రజల పక్షాన ఉండాలని, కళ ప్రజల కోసమే అనే దృక్పథంతో రచనలు చేసిన ప్రముఖుడు మాక్సిమ్ గోర్కీ అని ప్రశంసించారు. నవల లోని కొన్నిసన్నివేశాలని వివరిస్తూ సమకాలీన సమస్యల పోరాటానికి అమ్మ నవల ఉపయోగపడుతుందని అన్నారు .

అంతకుముందు డా. కె. సునంద 'ఆమ్మ' నవలలోని ఇతివృత్తాన్ని వివరించారు. నవల చదవని వారికి నవల చదివినంత స్ఫూర్తిని కలిగిస్తూ కథను వినిపించారు. సభకు డా . పిల్లలమర్రి రాములు అధ్యక్షత వహిస్తూ సమస్యల పరిష్కారానికి పలాయనవాదం పనికిరాదని , పోరాటంతో వాటిని ఎదుర్కోవాలని ఉద్బోధించారు.' ఆమ్మ' నవలలో కళా విలువల గురించి డా. దార్ల వెంకటేశ్వరరావు ప్రసంగించారు . ఆచార్య హరగోపాల్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. జిలుకర శ్రీనివాస్ తన స్పందనను తెలియజేసారు.

## రైతు కథ కు ఆహ్వానం

రైతు జీవితాల్ని ప్రతిబింబించే సాహిత్యం అసంఖ్యాకం గా వస్తున్నది. గతంలో రైతు జీవితాల్ని వ్యక్తీకరించిన కవితల్ని ఏర్చి కూర్చి "రైతు కవిత" సంకలనాన్ని వెలువరించాము. సాహిత్యాభిమానులు ఈ సంపుటిని ఎంతగానో ఆదరించారు. ఆ స్ఫూర్తి తో ఇప్పుడు "రైతు కథ" ను సంకలించదలిచాం.

తొలినాటి నుండి రైతుల జీవితాల్ని స్పర్శించిన కథల్ని పంపించవలసింది గా కథకుల్ని, సాహిత్యాభిమానుల్ని అభ్యర్థిస్తున్నాం. వివిధ పత్రికల్లో, కథా సంపుటుల్లో ప్రచురితమైన కథల ఫొటోస్టాట్ కాపీలను కాని లేదా ఒరిజనల్స్ కాని పంపించాలి. ఈ సంపుటి కోసం ప్రత్యేకించి రాసిన కథలు అంగీకరించబడవు. గతంలో ప్రచురితమైన కథలు మాత్రమే పంపగలరు. డా.పాపినేని శివశంకర్, బండ్ల మాధవ రావు, ఎం.వి.రామిరెడ్డి లు సంపాదకులుగా ఉన్న ఈ సంకలనానికి కథలు పంపవలసిన చిరునామా:

డా. పాపినేని శివసంకర్
3వ లైన్, విద్యానగర్
గుంటూరు - 522 006.

లేదా

బండ్ల మాధవ రావు
306,రాచకొండటవర్స్
అల్వాల్, సికింద్రాబాద్ - 500 010.

లేదా

ఎం.వి రామిరెడ్డి,
కోట రెసిడెన్సి, పోలీస్ స్టేషన్ దగ్గర
మియాపూర్, హైదరాబాద్.

- బండ్ల మాధవ రావు

మస్కమస్కనే ఉన్నది. ఇంకా పూరా తెల్లారలేదు. ఎదురొచ్చే మనిషి నిద్ద కనిపించడం లేదు. ఆడోల్లు వాకిల్లూడ్చి సానిపి జల్లుతున్నరు. మొగోల్లు ఎడ్ల కొట్టాలల్ల హెర్రె... హెర్రె... అని ఎడ్లను అదిలించుకుంట పెండకసువు తీస్తున్నరు. ఇంకొంతమందేమో అరక గట్టనీకె పగ్గాలు, బారల్లు గుంట్కునొగలను సగసేసుకుంటున్నరు. మంచినీల్ల కడ్వలు పట్టుకొని ఆడోల్లు ఒక్కరొక్కరే మంచినీల్ల బాయికి పోవట్టిండ్రు.

బంటు పెంటయ్య బంటులారీని పట్టుకొని ఆగమాగం ఉర్కి రావట్టిండు. "ఏం పానం పోయిందని అంతగానం ఉర్కొస్తున్నవ్ సీకట్ల రాల్లు తాకి కిందపడవే పెద్దప్ప," అని మందలించింది మాదిగ దున్న నర్సమ్మ. సర్పంచుకు జప్పన జెప్పి పోవాలమ్మా అనుకుంటనే అదే ఉర్కు మీద నడ్సిండు. సర్పంచు బాలప్ప లేసినాడమ్మ లేవకుంటే జెర లేపు బిడ్డ. 'బలె జెప్పతున్నవే. విత్తనాలు ఎదుకువెట్టె దినాలు ఎట్ల పండుకుంటరె,' అన్నది సర్పంచు పెండ్లం. 'అవ్వమ్మా... నీ మొగడు ఉర్కిఉర్కి అర్క గొడుతున్నడు...' అని చెప్పుకుంటనె తాను యిడ్పులలుకుడు పనిలో మునిగిపోయింది. 'ఇంత నస్కులొచ్చినా మనిషి జిక్కకపాయె గదప్పా,' అనుకుంట జెర పిల్లల పంపియ్యమ్మా దొర అగెత్రానా రమ్మన్నడని చెప్పు. నేనొచ్చినిలవడిపోయినని జెప్పు కొడుక. ఇంకా పెద్దమాతర్లకు, పనిబాట కులపెద్దలకు సెవు మీదేసేదున్నది?' అనుకుంట నెత్తికి గట్టిన రుమాలిని సరిజేసుకుంట ఎల్లిపోయిండు బంటు పెంటప్ప.

* * *

ఇంకా పొద్దు కూడా పొడ్వలేదు. బంటు పెంటప్ప ఇట్ల సెవు మీదేసిండో లేదో కులం పెద్దలంతా అట్ల జేరిండ్రు. సర్పంచుతో సహా దొర ఇంటికి. పొద్దు బారెడెక్కింది. నడినెత్తి మీదికొచ్చింది. దొర అడ్డలుంగిని ఒక చేతిలవట్టుకొని బైటికొచ్చిండు. ఈల్లంత ముందే చెప్పుకున్నట్లు కృష్ణరెడ్డి పటేలు, శ్రీనివాస్‌రావ్ పంతులు, నర్సింహ్మారెడ్డి, అనంతరెడ్డి పటేలు, ఒక్క దగ్గర జేరిండ్రు.

ఈల్ల రాకతోని సబ్బండకులాల మ్యాతర్లు నెత్తి రుమాల్లు తీసి సంకల వెట్టుకొన్నరు. చేతులతో పబ్బతివట్టి కొరెంటు ఒకరు దండం దొర... దండం దొర... దండం దొర... అన్నరు. వీల్లకు ఎదురుగా ఐదారడుగుల దూరంలో గాయిదోల్లు ఏసిన కుర్చీలో దొరలు, పటేండ్లు కూసున్నరు.

నరేందర్‌రెడ్డి సెప్పుడు సుర్వు జేసిండు.'అరె సాయిగా, ఎల్లుగా, నాగా జెర బాగా యినుండి. రాతిరి జరిగిన సంగతి జెపుత.'

రాతిరి నాకు ఊరడమ్మ కలలొచ్చి, 'ఒరే ఊరినె నాశనం జేస్త కొడుకా, ఊరికి గత్తర జేస్త. ఊరు మంచిగుండాలంటే, నేను మంచిగుండాలె లేకుంటే ఊరును అల్లకొల్లాలం జేస్త. నాకు ఆహూతి గావాలె. నా యక్కజెల్లెండ్లు మైసమ్మ, పోషమ్మ, రక్తమైశమ్మ, బంగారమ్మ, ఈదెమ్మ, ఇంతమంది ఆకలిగొని కూసున్నరు. ఈల్లందర్నీ సముదాయించుకొని ఇంతదాక ఒపిక వట్టిపిచ్చిన కొడుకా. ఈ ఏడు ఊరడమ్మ పండుగ ఏడు

యాటలతోని జేస్తవా లేదా?' అని, 'లేకుంటే నీ ఇంట్ల అందర్నీ తట్టు వోపిచ్చి నర్లి నర్లి సంపిస్త,' అని రాతిరంత నన్ను అమ్మ నిదురవోనియ్యలేదురా. ఎట్ల జేతం. ఆ ఏర్పులదాన్ని, బైండ్లోన్ని, ఆ పోతురాజు సాయిగాన్ని, పిలిపిచ్చి, అడిగి ఈ ఏడు- ఎట్లనో ఒగల్యాక పండుగజేసి అమ్మగారికి ఆహుతి జేసి ఒప్పిపిత్తం. ముందు ఆ ఏర్పులదాన్ని పిలిపిచ్చి అడుగుదము అది ఏమంటదో- ఎప్పుడు వెట్టుకుందమంటదో. జర విలుసుకరా పోరా జెప్పన వోయి రావో, అని జీతంగాన్ని పంపించిండు.

అయితాయె పటేల. పోయొస్త జెర్ర దూరం నడిసి, ఇసంత పెండేలోల్ల ఇంటికాడికి వొచ్చి ఒరేయి పటేలుకు రాతి ఊరడమ్మ నాకు కలలొచ్చి పండుగజేసి జాతర నింపుతవా లేదా అంటాని అన్నదంటరప్ప. ఈ ఏడు ఊరడమ్మ పండుగ జేసెటట్లున్నరు. నన్ను బైండ్ల సాయమ్మ ఇంటికి వోయి తోల్కరమ్మన్నరు. నేనందుకే పోతున్న అని సోపతిగాల్లకు జెప్పిండు సంబంరంగా జీతగాడు.

నన్నెందుకు రమ్మంటున్నడప్పా! ఎన్నల్లేంది? ఎందుకు రమ్మన్నడో నీకు తెల్వది గిట్టనా? పో! ఆనందడువు ఊకెనె ఊగులాడుకుంట వొచ్చినవా? ఎందుకో నీకు ఎర్కుంటది జెర్ర జెప్ప. పటేలేమి నిన్ను నముములకోని మింగడు సెప్తెనే ఒస్త లేకుంటే లేదు. పో నాకు ఇక్కడ పని వున్నది.

నాకేమెర్కమ్మ అని సంగతులు నాకు జెప్తడా? ఏమొ ఊరడమ్మ కలలొచ్చిందంట అతనికి జాతర నింపాలెనంట నిన్ను పిల్సుకరమ్మన్నడు దామ్మ గిదే సంగతో ఇంకేమన్న సంగతో అని జెప్పి వెంటకు మల్లిండు జీతంగాడు.

ఓ అన్ని ఎరుకుండి గూడ నాకేమెర్క అంటున్నావు ఎర్రి పిలగాని లెక్క. గిట్ల వొందజెప్తె అయిపాయె గదా. నడువు పోదం. అరెయి ఎల్లుగా! తమ్మి, రాంసెంద్రి అన్నను దోలుకోని ఆడికి పటేలు ఇంటికి రాండి... ఏమొ మాట్లాడుతరంట.

నమస్తే పటేలా! శాన దినాలకు మతి ఒస్తినా పటేలా మీకు! అన్నది సాయమ్మ.

ఆ... ఏం సాయమ్మ, ఎన్నడు మర్సినము నిన్ను. తాతల నాటి నుంచి మీరు పండుగ జేస్కుంటనే వొస్తున్నరు గదా. మా తాతలున్నపుడు, మీ యవ్వనో ఎవ్వరో జేసింద్రంట. మా నాయనోల్ల లెక్కల మీ వోల్లే జేసింద్రు. ఇప్పుడు మనలెక్క నడుస్తనే ఉన్నది. ఇగ ఎప్పుడు మరిసినట్లు నిన్ను? దా కూసో మీ అన్నదమ్ములంత ఒచ్చింద్రా? పిల్సుకున్నవా? అడిగిండు పటేలు...

ఆ పిల్సుకొన్న పటేలా! ఇగో ఒచ్చింద్రు. తమ్ముడు, అన్న ఒచ్చింద్రు జెప్పింది సాయమ్మ.

అగో తమ్ముడు. అన్న ఒస్తే సరిపాయెనా? పాల్యోడు, అవతలోడు రాలేరా? పిలవలేవా నీవు? నీ ఎదురువాల్యోడు యాడున్నడు? అడిగిండు పటేలు.

దాందేమి పటేలా పిలిపిచ్చే సంగతి అంతదాక ఉంటే నీవే పిలిపియ్యి, దానికేమి సంశయము లేదు. ఆల్లు గూడ రాని నీవె పిలిపియ్యి పటేలా?

అరెయి! ఆ పాలిబైండ్లోన్ని గూడ రమ్మనుపోరా!

ఆ... వొచ్చిన దొర... అన్నడు ఎనకాల గొంగడి కప్పుకొని నిలవడ్డ బైండ్ల అంతప్ప.

ఏం...రా! అంతిగా... యాడ గనవడవు. మీరంత ఒక్కటే లెక్కలున్నరా? లేక ఎవరి లెక్కవాల్లదా. ముందు అడిగి తెల్సుకునాలె గదా. ఎందుకైన

మంచిది. అడిగిండు పటేలు. ఆ... పటేలా నీకు తెల్వంది ఏమున్నది. అందరమొక్కటే. ఏం పండుగ జేస్కున్న ఆల్లిద్దరు మేమిద్దరం సెరిసగం లెక్క దీస్కోని పంచుకుంటన్నం. అప్పొచ్చినా, అందానొచ్చినా ఏమోయి రామయ్య ఏమనవు?

నన్నడుగతవేమి నీవు లేని మాట గిట్ట అంటున్నవా? అవు పటేలా సమానమే ఉన్నం అన్నడు రామయ్య.

అట్లయితే మునములకు ఒస్తున్న. సూడుండి ఇగో నాకైతే నాతిరీ ఒక కలంపం అయింది. ఆ కలంపం కాయం జెయ్యాలని నేను అనుకున్న.

సూడుండి ఊల్ల పెద్దలు అందరొచ్చిండ్రు మ్యాతర్లందరొచ్చిండ్రు. ఎర్పులది ఒచ్చింది పోతురాజు ఒచ్చిండు అందరం మాట్లాడుకోని ఒగ ఒప్పందానికి రావాలె. 'రడమ్మ పండగ' విషయంల జాతర నింపాలనుకున్నం మరి ఎవరి సందేహం, ఎవరి సమాధానం ఎట్లనో అందరు సెప్పాలె ఏమంటరు? అందరు జెప్పేది ఏమున్నది. ఊరి విషయము అందరు మాట్లాడుకునాలె అందరం తలా ఇన్ని పైసలేస్కోని పండుగ మాత్రం బాగా జరిపియ్యాలె. సుట్టు పల్లెలన్ని యాట జేస్తున్నయి. మనం గూడ ఈయేడు తప్పకుండా జరుపుదమని నా ఇష్టపూర్వకంగా జెప్తున్నా. నా బర్లల్లది ఒగ దుడ్డెను ఊరడమ్మ పేరు మీద ఇడుస్తున్నా. అన్నడు పటేలు.

అవు. పంతులన్న మాట మంచిగున్నది నేను గూడ అంతే అనుకున్నా నాత గూడ ఒగ పోతుదుడ్డె ఉన్నది. ఊరడమ్మ పేరు మీదనే నొగటి ఇస్త. అన్నడు పట్వారి.

ఆల్లయి రొండు ఆయే గదప్ప. నాదొగ పోతు ఊరడమ్మ పేరు మీద అన్నడు నర్సింహ్మారెడ్డి.

మాలమాదిగోల్లు, తెలుగోల్లు, గొల్లోల్లు, మంగలోల్లు, సాలోల్లు, ఈడిగోల్లు, సాకలోల్లు, బెస్తోల్లు, ఇంటికి మానెడు బియ్యం, కులం పెద్దలు, యాటనియ్యాలే అనుకున్నరు.

ఆ... సరే మంచి పనికి ఎవ్వరి ఆటెంకము ఉండరాదు. పంతులుది ఒగటి, దొర దొగటి, సబ్బండోల్లయి ఐదు. అన్ని ఏడు యాటలైతున్నయి గదా, రేపు సుక్రారమున్నది. ఊరడమ్మ గుడి ముందలికి తెచ్చి దుడ్డెలనన్ని పట్టుకొచ్చి డప్పుల మీద తెచ్చి బండారు ఏసి ఇడువాలె. అరెయి డప్పులోల్లు, రేపు పొద్దుగాలనే తొమ్మిది గంటలకల్ల ఊరడమ్మ కాడికి రావాలె. అంత అయిపోయి నట్టే గదా. ఇగ ఇంకేమున్నది ఏర్పలమ్మదే కట్నం సంగతి మాట్లాడితే ఆ పని గూడ అయిపోతది. ఏమంటవు చెప్పమ్మా ఏర్పులమ్మ.

ఇంకేమున్నది. ఆ పని గూడ అయిపోని అడుగమ్మ అన్నరు మిగతా పెద్దలు.

సెప్ప. సాయమ్మ ఏమి సంగతి నీ కట్నం జెప్ప-ఏమేమి గావాలె. ఎట్లెట్ల సంగతి నీది తెగినంకా, పోతురాజు సాయిగాన్ని అడుగుతము. సెప్ప సెప్ప అన్నడు పటేలు.

సూడు పటేలా, నేను పూర మొదటి లెక్క అడుగుదునా? లేక అనామతుల అడుగాలెనా? అన్నది ఏర్పుల సాయమ్మ. ఇది పండుగ. ఊరికి పెద్ద పండుగ. అనామతుల ఎందుకడుగుతవు మంచిగనే అడుగు అన్నడు పంతులు. పోయిన ముందటేడు మన ఊర్ల ఊరడమ్మ పండుగ జేస్తె

నన్ను పిల్వకుండ పక్కూరు ఏర్పులామె మెనుదెచ్చి పండుగ జేస్తిరి. ఇప్పుడేమొ నన్ను కట్నమడగమంటున్నరు. నా మాన్నెం సంగతి ఎటూ తేల్పకొస్తిరి. అని మొదలుపెట్టింది సాయమ్మ.

కాదు సాయమ్మ నీవు అన్ని మాట్లాడకు మొదలు నీవు ఈ ఊరికి ఏర్పుదానిగ వుంటవా లేదా? చెప్ప గంతె అన్ని పంతులు. ఉంట పంతులు కాని నా భూమి సంగతి చెప్పండి. ఎనుకటి మా యత్త ఏర్పుల తనం జేసుకుంట మూడెకురాల భూమి సంపాయించిందంట. ఇప్పుడు అందుట్ల మీ కాక కొడుకు కాస్తులున్నడు. మా అత్త భూమిని మీ కాక కొడుకు దగ్గరకెల్లి నా కిప్పియ్యాలె దొర అన్నది సాయమ్మ.

ఇంత ఎదురుగా ముఖం పట్టుకొని భూమి నీ కాక కొడుకు కబ్జల ఉన్నదని ఇంతమంది ముదల అడుగతదనుకోలేదు. దొరకు మస్తు కోపమొచ్చింది. అందరి ముదు జోరు జారి మాట్లాడకూడదని అని నిబాయించిండు దొర. ప్రశాంతాన్ని సూపిస్తూ... ఈమెకు మాట్లాడ సందిస్తె సాలు. ఎనకటియన్ని తొవ్వి తీస్తది. ఏరే మనిషికి మాట్లాడ సందియ్యది సిన్నంతరం లేదు, పెద్దంతరం లేదు. పెద్దోల్లతోని మాట్లడే తరీక కూడ లేకుంటె ఎట్లమ్మా... అన్నడు దొర. మిగితావాల్లకు మీరే జెప్పండి అన్నట్లు చూసిండు. ఏందయ్య నరేందర్ దీనికి ఏమి యిమ్మతు ఈల్ల భూమిల మీవాడుకాస్తున్నడంటుంది ఈ ఏర్పుల దానికి భూమెక్కడిది? ఎవరిచ్చింద్రు దానికున్న అనుమానాన్ని కూడా ఇంత గట్టిగా మాట్లాడ్తదా?... అయిన ఇంత అలుసునివ్వడం నీదే తప్పు దొర అన్నడు... కృష్ణారెడ్డి పటేల్.

ఈ బయిండ్లోల్లది గింతెనయా... ఎదురుగ నిలపెట్టి మాట్లాడితేసే. సెత్తికెక్కుతరు యాడ పెట్టాలెనో ఆడనె ఉంచాల. ఇంతింత రమ్మంటే ఇల్లంత పర్సుకున్నరంట. ఏదో ఊరడమ్మ పండుగల ఏర్పుతనం జెయ్యమంటె భూముల గూర్చి మాట్లాడుతరు. భూమి ఆగానికొచ్చిందనుకుంటున్నరా, గాలిలోచ్చిందనుకుంటున్నరా... అడ్డమైనోల్లకు భూములు కావాల్సి వస్తున్నది.

ఈ ఏర్పులామెను ఎక్కువ తిరితే పోయినేడురాను అని చెప్పినట్ల ఈ ఏడు కూడా రానన్ని చెప్పగల్ల. సల్లగ మాట్లాడి బుదగరిచ్చి ఈ ఏడు ఊరడమ్మకు చేసి రంగమెక్కియ్యాల... అని ప్రశాంతంగా మాట్లాడడం సురువు జేసింద్రు.

సాయమ్మ అస్సలు నిజం నీకు జెప్పాలెనా? ఎనుకటికి మీ యత్తకు భూమి లేదు. అది ఎవ్వరి దగ్గర దర జెయ్యలేదు. అట్ల జేస్తె గీస్తె కర్ణం పటేలు దగ్గర ఆ కాయితాలుంటయి. మా తాత, తండ్రి తర్వాత నేనే గద కర్ణంతనంను జూస్తున్న. ఉంటే నేను జెప్పనా నిన్ను కుద్దు పిల్సి జెప్త. ఏందమ్మ నీవు మా ఊరు ఏర్పలదానివి. నీకు జెయ్యమా, ఊరంత జేస్తం. పక్కూర్లకు జేస్తం. నీకు జెయ్యనీకే ఏం బాద నాకు...? ఆనాడు మీ యత్తకు భూమి లేదు... మరిప్పుడు నీకు లేదు. మన ఊరి లెక్కల ఏర్పులతనం జేస్తె భూమి ఇయ్యినికే వీల్లేదు. మీ యత్తకెట్లుంటది అది ఇప్పుడు నీవెట్లడుగుతవు. నీది అసలు తరీకనే కాదు అన్నడు పంతులు. లేదు పంతులు మా యత్త భూమి జెయ్యంగ ఈ

ఊరు పెద్దలు జూసింధ్రు, మా యత్త పన్నుగట్టినట్టు రసీదులున్నయి.
మా యత్త ఏర్పులతనం జేసినంక ఇంగ నేనే అయిన. నాకు ఏర్పుల గురువు మా అత్తనె. ఆమె వృత్తికి, ఆస్తికి నేనే వారసురాలును.
నీవు మీ యత్త భూమిగాలంటున్నవు. మల్ల ఏర్పులతనం జేస్త అంటున్నవు. ఈ వూరిదాన్ని గదా అని అడుగుతున్నవు... అట్లెట్లనే అన్నడు... పంతులు.
దొరా నేను ఏర్పులతనం జెయ్యనంట లేను. నా భూమిని నాకిస్తె అందుట్ల పండె నాల్గిత్తులు నా పిల్లల పొట్టకైతెయి. మా అత్త బూమిని నాకిస్తె నేను పండుగ జేస్త... అన్నది సాయమ్మ.
సూడే... అనవోయి... దొర గప్పున ఆగిపోయిండు. సూడమ్మ నోరు తెరిస్తె భూమి, భూమి, భూమి అని పలువరిస్తున్నవు ఇగ నీ ఎదురుగనే జెప్పుతున్న. మీ యత్తది భూమి లేదు. నీకు భూమి లేదు. నీ యిస్టముంటే ఏర్పులతనం జెయ్యి. లేకుంటే లేదు. అంతనుకుంటె కూలిలెక్కల పండుగజెయ్యి. నీవురంగమెక్కితె కూలి లెక్కన జెయ్యి. గంతె. గాని తాకట్లు పెట్టుకొనేది లేదు. నీవు రాననంటే పండుగ ఆగుతదా? దేశం గొడ్డుపోయిందా? కోటపల్లి ఏర్పుల్దాన్నో... చింతకుంట ఏర్పులదాన్నో తీసుకొస్తం. అయ్యేటి పండుగ ఎట్లనన్న అయితది. బంగారుకత్తి అంటాని మెడ గోసుకుంటమా...? నీవు మేము ఎదురెదురుగా పంచాదెందుకు. రేపే ఏర్పుల్దాన్ని తోలుకొస్తము అని అన్నరు. నేను కూలి లెక్కన ఎట్ల... నేను కూలిదాన్ని ఎట్ల? ఇన్ని దినాలు ఊరి ఆడ్విల్ల అని నన్ను కూలిదాన్ని అంటరా... హా... కూలిదాన్ని అంటరా... హా... కూలిదాన్ని అంటరా... అదెట్ల...? నేనీ ఊరిదాన్ని గానా? నా మాయిముంత ఇక్కడ లేదా, నేనీడ పుట్టలేనా? కూలిదాన్ని నేనెందుకు గావాలె? మా యత్త భూమి నాది. నాకు గదే గావాలె.
ఈ ఊరంత కలిసే కదా నన్ను జోగికిడిసింధ్రు. తాతల నాటి నుండి మా యింటి ఆడ్విల్లలను ఏర్పులతనంల ఏస్తున్నరు గదా. మా పేరు మీదున్న భూమిని నాకియ్యిమంటె కూలిదాన్ని అంటరు.
ఇన్ని దినాలు కూలిదాన్ని అయి ఈ పండుగలు జేసిన్నా?
అని అన్నదే గాని సాయమ్మకు తన జీవితపు సంఘటనలు మనాదిలకు వచ్చినవి. ఒక్కొక్కటే నిమరేసుకుంటున్నది. తన కన్నబిడ్డలను పెంచుట్ల, సదివించుట్ల, పెద్ద బిడ్డ పెండ్లి జేసుట్ల పడ్డ తిప్పలు పగోల్లకు కూడ రాకూడదనుకున్నది. కడుపులున్న నిప్పల కాగు పగిలిపోయినంతగా సాయమ్మకు కోపం, ఆవేదన తన్నుకొస్తున్నది. ఇంతకుముందు మాట్లాడినట్లు ఇప్పుడు మాట్లాడలేకపోతున్నది.
దొరలు పటేండ్లు మాట్లాడిన మాటలకు చేతలకు పొంతన లేకుండా ఉంటున్నందుకు, ఎంత హీనమైన మనుషులు వీల్లు అనుకున్నది. ఇంతకుమందు దొరలు అని మర్యాదిచ్చింది. నన్ను జెగినికేసినోల్లు నా బాగోగులు జూడరా... అనుకున్నది అమాయకంగా. ఇప్పుడు వాల్లో పురుగుల్లా కనిపిస్తున్నరు సాయమ్మకు.

ఇంతసేపు మాట్లాడకుండ ఉగ్గుపట్టిన సాయమ్మ... నాలుగడుగులు ముందుకు నడ్సి దొరల మొఖాలనన్నింటిన్ని తేరిపార జూస్తున్నది.

కూలి లెక్కల జెస్తదా...? వేరే ఊరు ఏర్పులామెను తీసుకొచ్చుకొండి అంటదా... ఈ రొండిట్ల ఏదో ఒకటి చెపుతది లే... అని అందరూ సప్పుడుదాక ఎదురు చూస్తున్నరు.

పనిబాటోల్లు, దొరలు ఒక దగ్గరున్నపుడు ఆవరించిన నిశ్శబ్దం కారుచీకట్లను కమ్మింది. ఏమయితదో... పని బాటోల్లకు... పాల్లుపోకుండా ఉన్నది. అందరు మాత్రం బైండ్ల సాయమ్మనే జూస్తున్నరు. దొరా... మీరు నాకిచ్చె కూలి మీ బిడ్డకిస్త జోగుకిద్వుండి. పండుగల రంగమెక్కమనుండ్రి... సూస్త, అని సాయమ్మ దొర ముందున్న బల్లను పిడికిలి బిగించి దన్నుమని గుద్దింది. ఊరును కమ్మేసిన కారుచీకట్లు పగిలి తెప్పున తెల్లారినంత ఎలుగయింది.

ఒకరి ముఖాలు ఇంకొకరికి స్పష్టంగా కనిపిస్తున్నయి. సాయమ్మది ఇంకా స్పష్టంగా కనిపిస్తున్నది. దొర నోరు కండ్లు ఎల్లవెట్టండు కర్ణం పంతులు, పటేళ్ళు నోర్లు తెర్సిండ్రు, కండ్లు ఎల్లవెట్టిండ్రు. నోర్ల తడి ఆరిపోయింది. ఎంతసేపయిందో నోటి నుండి మాటరాక వాల్లకే తెల్వకొచ్చింది.

ఇగ సూస్త సూస్త బైండ్ల సాయమ్మ పోయి దొరదో, పటేలుదో, పంతులుదో ఎవరిది గల్లవట్టి గుంజుతదో ఎవరికి తెల్వకొచ్చింది.

ఎక్కడనో ఉప్పెనలో ఇరిగిపడే చేట్లసప్పుడు, గాలిలో నుండి అందరి చెవులకు శరీరాలకు స్పర్శిస్తున్నది. సెవు గూచిలు పగిలె ఉరుములు సప్పుడు.

సాయమ్మ ముందుకు అడుగేసింది పటేండ్లకు ఎదురుగా కదులుతున్నది... పటేండ్లు అక్కడి నుండి పక్కకు జర్గుదం అనే సోయి లేనంతగా బీరిపోయి సూస్తున్నరు.

కడకున్న మ్యాతర్లు, పోయి అమ్మా... అమ్మా... అమ్మా ఇగ ఆగమ్మ సాయమ్మ అని ఆమెను నిలబెట్టడానికి సేతులడ్డం పెట్టిండ్రు. ఒక మ్యాతరిని ఎదల సెయ్యేసి నూకిత ఎల్లొంకల పడ్డడు... సెయ్యెత్తు మనిషిని ఒక చేతితో నూకితె పడ్డడంటే ఈమె మాములు సాయమ్మ గాదు. కచ్చితంగా ఏర్పుల సాయమ్మకు ఊరడమ్మ ఊనింది. ఈ పనంతా ఊరడమ్మ తల్లిదే అని అందరు నిర్ధ అయిండ్రు. పటేండ్లు సేతులు జోడించిండ్రు అప్రయత్నంగనే. నరేందర్‌రెడ్డి దొరకు కలలో వచ్చి హెచ్చరించిన ఊరడమ్మ తల్లి గాలి ఇప్పటినుండే సురువయింది అనుకున్నరు. అందరొక్కసారి సాయమ్మ అన్నదమ్ములొంక వేడుకున్నట్లు జూసిండ్రు. పోతురాజు సాయిప్పను ముందటేసిండ్రు. అయిదు మందన్నదమ్ములు తలా ఒకొంక పట్టుకొని ఎంటకు గుంజుకరానికే జూసిండ్రు... ఆల్ల నొక్కసారి ఊరి గుడ్లురిమి సూసింది...

* * *

అందట్ల అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క బిడ్డ సాయమ్మ. ఆడుతపాడుత రాణిలాగ జూసుకున్నది. బైయిండ్లోల్ల కుటుంబం. మాదిగోల్లు, మాలోల్లు, తెలుగోల్లు, ఈడిగోల్లు, కుమ్మరోల్లు, గొల్లోల్లు, కమ్మరోల్లు, సాకలోల్ల పిల్లలతో ఆడుకుంట ఊరంత కలియదిర్గేది. తినవెట్టనికె తల్లికి దొర్కెది కాదు. అన్నదమ్ములు పనిబాటోల్ల కులాల కేరిల్ల దేవులాడి... పట్టితెచ్చి... బుదగరిచ్చి... బుక్కలు వెట్టేది తల్లి. కులం, కుటుంబం ఆడ్విల్లలకొచ్చే వారసత్వంగా

జోగుకిడిసింద్రు. మ్యానమామ ఇడిపించుకున్నడు. జోగుకిడిసిన ఆడిది 'ఊరుమ్మడి పెండ్లం' అనేది ఊరులో కుదురలేదు. ఆజానుబావులైన అన్నదమ్ములు, ఎనిమిదెకరాల భూమి ఎవుసం, సెల్లెని అల్లారుముద్దుగా పెంచిన తీరు. పిబాట కులాలోల్లకంతా పనోల్లే ఈ బైండ్లోల్లు. సెల్లె, అక్క వదిన, పెద్దమ్మ, మరదలు అనే వాయివరుసతో నడిసింద్రు. 'ఊరు ఆడ్విల్ల'గా కొనసాగుతూ వచ్చింది సాయమ్మ. యసొొచ్చి మనసుపడి తెలగొల్ల సెంద్రప్పను ప్రేమించింది. అతనికే పెండ్లి జేసింద్రు తల్లిదండ్రి. సంసారం, పిల్లలు, ఆల్ల సదువులు సజావుగానే నడ్సినయి. కాలం దీరి ఒకనాడు సెంద్రప్ప కాలం జేసిండు. బైండ్లోల్ల ఇంట్లకెల్లి పీనుగను తీసుకపోయి తెలుగోల్ల ఇంట్ల వండపెట్టింద్రు. సాయమ్మ, పిల్లలు మొత్తుకుంట ఏడ్చుకుంట తెలుగోల్ల ఇంటికి పోయి పీనుగ మీద పడి ఏడుస్తున్నరు. రెండు మూడుగంటలు ఏడ్సింరు. తెలుగోల్లు కూడా అయ్యో బిడ్డా అని సాయమ్మను పట్టుకొని ఏడ్సింద్రు. జెర్రసేపటికి ఏమయిందో ఎవరికి తెలువది. బంతనొొచ్చి తెలుగోల్లకు ఏదో చెవుల జెప్పిండో లేదో అందరి ముఖాలు మారుతూ వచ్చినయి. దిక్కు తోచని ఇదిలో ఏడుస్తు సాయమ్మ ఇవేవి పట్టించుకుంట లేదు. తల్లి, వదిన ఓదారుస్తున్న ఆగడం లేదు. పిల్లలను కనిపెట్టుకొనుంటున్నరు... అన్నలు, తమ్ముడు.

తెలుగోల్ల కులపెద్దొచ్చి, సాయమ్మ... నీవు ఇంట్లకొచ్చి పీనుగు మీద పడి ఏడ్వకమ్మ బయటపోయి ఏడ్వుపో... అన్నడు. మొగడుపోయిన ఆవేదన అగాదానికి... కుల పెద్ద కొట్టిన పెద్దగోతి పక్కపక్కల జేరినయి. బైండ్ల ఆడామె అయినందుకు అంతవరకు తెలువని అంటరానితనం పీనుగకాడొొచ్చేటాల్లకు అతని పెండ్లం అతని దగ్గర కూసోని ఏడ్వకుంటె ఇంకాడ ఏడుస్తది. మీకేమన్న నెత్తి ఉండే మాట్లాడుతున్నరా...? అంత కులం ఎక్కువనుకున్నోడు ఆమెను ప్రేమించి పెండ్లెందుకు జేసుకున్నడు. ముగ్గురు పిల్లల సంతానం అయినంకా సచ్చినప్పుడు పీనుగ ధ్గరకే వచ్చిందా అంటు అన్నడు మాదిగ పెద్దమాతరి నాగప్ప. కాదప్పానీవు మ్యాతరివే నేను మా కులం మ్యాతరినే. ఇద్దరం పనోల్లమే. ఇప్పుడు కొత్తగా జెప్పకునేది ఏమున్నది...? మరి... మరి... అని ఊర్ల కర్ణం పటేలు జెప్పినప్పుడు ఇనాల్సి వస్తది. కుల మాతర్లు మాట్లాడుతునే ఉన్నరు. తెలుగోళ్ళు పోయి సాయమ్మను బయటపోయి ఏడ్వమ్మ అని ఇంక జెర్ర గట్టిగనే జెప్పింద్రు.

పీనుగ దగ్గర సాయమ్మ ఏడిస్తె అంటయితదని ఊరంతా పాకింది. సాయమ్మను ఏడ్వనియకొచ్చింద్రని తెల్సి మాదిగ మాల, బైండ్ల పడుసుపోరలంత ఉర్కొచ్చింద్రు. 'ఎవ్వడాడు ఏడ్వనియ్యని కొడకు' అని తెలగొల్ల వాకిట్ల నిండింద్రు.

పీనుగ కాడ లొల్లులు జెయగూడదని పిల్లలకు నచ్చజెప్పి ఆపింద్రు కులం మ్యాతర్లు.

'ఇంట్లకెల్లి ఎల్లిపొండి బయట కూర్చొని ఏడ్వుండి,' అని జెప్సింతె కూడా అక్కడ పడుండె లత్కోరుతనమెందుకు. నడువు నడువ్ సాయమ్మ పీనుగను తీసుకొని మన కేరీలకు పోదం అన్నరు సాయమ్మకు నచ్చజెప్పతూ... మాదిగాడోల్లు

'పట్టు పట్టుండ్రి పీనుగను' అని మాదిగ బైయిండ్ల మొగోల్లు పంజలు మీదికి ఎగజెక్కి నెత్తి రుమాల్లు గుంజి కట్టుకున్నరు. గట్టెట్ల తీసుకపోతరు. అతని ఈ కులంల పుట్టిండు. ఈ కులం కంపురం కడ్తది. కాడి మోస్తది. బొంద పెడ్తది. బతికున్నప్పుడు ఆయప్ప మాటెన్నడు కులం తీసెయ్యలేదు మరి సచ్చినప్పుడు కులం మన్ను జెయ్యాలే. తండ్రి తలగోరువట్టాలే. అన్నరు... తెలుగోల్ల పెద్దలు. పెండ్ల ముండంగా తండ్రి తలగోరు ఎట్ల వడ్తడప్పా... మీ మాట మీదికెల్లయినా పెండ్లం పిల్లలు ఉండంగా తండ్రి వస్తడా... అని మాదిగోల్లకు తెలుగోల్లకు వాదం పెరుగుతున్నది... ఏందిరా...! వాల్లతో మాట్లాడేది. మనమంత ఎక్కువోల్లం వాల్ల తక్కువోల్లు ఆమె చేసుకున్న పెండ్లం కాదు. ఉంచుకున్నది మాత్రమే. నడుప్ నడువుండ్రి ఇక్కడి నుండి అని ఓ పెద్ద గుపొచ్చింది సైన్యం లెక్కిన. మాదిగ పోరగల్లకు ఎదురుగ నిలవడ్డరు. ఇదంత జూసిన సాయమ్మ నా ఒక్కదానికోసం మావోల్ల నెత్తులు పల్గుడెందుకు..... 'ఈ పీనుగొద్దు మీ కులమొద్దు. నడువు నడువుండి తమ్మి ఒక్కరు గూడ ఇక్కడ నోరిప్పడానికి ఈల్లేదు. ఆల్లు పీనుగను ఇయ్యకుంటే మనే, నన్ను తలగోరు వట్టియ్యకుంటే మనే. నన్ను ఏడ్వనియ్యకుంటే మనే నడువండి,' అని సాయమ్మ అందరి నడిమికొచ్చి చేతులు జోడించి మరీ చెప్పింది. చెప్పినవోలె అందరూ సల్లవడ్డరు మాదిగబైండ్ల ఆడోల్లు మాత్రం గొల్లున ఏడ్సిండ్రు. తెలుగోల్ల ఇంటికెల్లి జాతర కదిలినట్లు కదిలి మాలకెరీలకెల్లి, మాదిగ కెరీలకెల్లి బైండ్లోల్ల ఇంటికి జేరిండ్రు.

సాయమ్మ ఇంట్ల గూటికెదురుగా పీనుగులెక్క బట్టలతో జేసి ఒక ఆకారాన్ని పండవెట్టిండ్రు. నెత్తి కాడ దీపం ముట్టిచ్చిండ్రు. రాతిరికి కథ జెప్పిపిచ్చిండ్రు. మాదిగోల్లు డప్పులు తెచ్చిండ్రు. బాగరోల్లు బొందదొవ్విండ్రు. పీనుగును మాదిగోల్ల బొందలగడ్డల సమాది జేసిండ్రు. ఉత్త పీనుగును కరాగ సావు జేసిండ్రు బైండ్లోల్లు అనుకుంటరు ఊరంతా.

* * *

'బిడ్డ'... ఇప్పటికే గండాలల్లున్నవు ఏమంట జోగుకిడ్సినమో నీవు సెరల వడ్తివి. ఇంకా సెరలవడుడెందుకు అని సాయమ్మ తండ్రి అనుకున్నడు. కోలకట్టెవట్టుకొని వణుక్కుంట వణుక్కుంటొచ్చి బిడ్డను నెత్తి మీదికెల్లి నిమిరిండు. ఊసిపోయిన సిఖను ముడేసిండు. ముఖానికి సల్లనీల్లు కొట్టిండు. బండారు బొట్టువెట్టిండు. 'సెల్లెను తోలుకపొండి కొడుక' అని కొడుకులకు జెప్పిండు రామప్ప. ఆజానుబావుడైన తమ్ముడు ఎల్లప్ప అక్కను ఎత్తుకొని భుజం మీద మోసుకొని ఇంటికి పోతున్నడు. ముఖం మీద సల్లనీల్లు పడ్డయిగాని మనసు కాలుతూనే ఉన్నది. కడుపు మండుతున్నది. సాయమ్మ కండ్లల్ల ఉరుములు కనిపిస్తున్నయి. ఇంగులం మీద నడుస్తున్న సివంగిలాగ కనిపిస్తున్నది. తల్లికోడి ఎగిరి పొడ్వనీక సిద్దంగున్నట్లున్న వాటం కోసం జూస్తున్నది. మీరు కూలివెట్టి పండుగ సెట్ల జేస్తరో సూస్త. కొడుకుల్లార... నా భూములకెల్లి జరుగకపోతే ఊరి సుట్టు ముమ్మూల పొలివడ్త... అప్పుడే ఈ ఊరికి బర్కతుంటది.

ఒక్కసారి దొర పటేల్ల, పంతులు ప్రాణాలు లేసొచ్చినయి అరిచేతులున్న ప్రాణాలు కుదుటవడ్డయి.

ఇగ ఊరు మాతర్లొంక మల్లిండ్రు.

ఏం... రా... అద్దున బైండ్లది మా ముందు బల్లగుద్ది కానూను మాట్లాడుతదా? అదట్ల మాట్లాడితే మీరంత సూతారం జుస్తున్నర్రా...

మీరు మొగోల్లు కాదురా...? గాజులు తొడుక్కున్నార్రా నీయమ్మ... పెండ్లం... లంజకొడుకుల్లారా... అని కోపంతో ఊగిపోతున్నడు దొర.

అంతట్లనే... రెడ్డిగారు మీరిప్పుడు కోపంజెస్తె ఏం లాభం లేదు. ఇప్పుడాల్లనని ఏం ఫాయిద లేదు. జర్గబోయో పండుగ గూర్చి ఆలోచించాలె అని కర్ణం పంతులు, కోమటి నాయిరామణ సావుకారి చెప్పిండ్రు దొరకు. మీరంత ఎల్లిపొండని మ్యాతర్లను సైగ జేసిండు సావుకారి. అద్దున బయిండ్లది బల్లగుద్దతదా? అని మల్ల మల్ల అంటాడేందోయ్ దొర. బల్ల ఊకెనే గుద్దిందా? మూమడుగనీకెనె కదా అనుకున్నరు, మాదిగోల్లు నలుగురు గల్సినచోట.

------ ------ ముగింపు ----------------